క్లుప్తంగా

కాండం తొలుచు పురుగు నివారణకు కషాయం తయారీ



ఎ.గోకవరంలో కషాయం తయారీకి ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ప్రకృతి వ్యవసాయ విధానంలో పురుగు నివారణ కషాయాన్ని మంగళవారం ఎ.గోకవరంలో గోశాల వద్ద తయారు చేశారు. ఐసీఆర్పీలు ఈ కషాయాన్ని రైతులకు అలవాటు చేయడానికి దీనిని తయారు చేశారు. ఆవు మూత్రం, వేపాకు, పొగాకు, వెల్లుల్లి పాయ, పచ్చిమిర్చి వేసి సుమారు గంట సమయం కాచిన అనంతరం ఈ కషాయాన్ని తయారు చేశారు. కాండం తొలుచు పురుగు, లద్ది పురుగు వంటి ఇతర రకాలు పరుగులు పంటకు హానిచేసే పురుగులను ఈ కషాయం నాశనం చేస్తుందని ఐసీఆర్పీలు తెలిపారు. ఏపీ నిర్మల, డీఎస్ఎం విజయ రాధిక హాజరయ్యారు.

ఉన్నత పాఠశాలలో విద్యార్థుల మధ్య ఘర్షణ

దెందులూరు: దెందులూరు గారపాటి హైమావతిదేవి ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇద్దరు విద్యార్థుల మధ్య వాగ్వాదం పెరిగి ఘర్షణకు దిగారు. ఈ ఘటనలో ఓ విద్యార్థి రాళ్లపై పడటంతో అతని చెవి, వెనుక రక్త గాయమైందని పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మల్లికార్జునరావు అన్నారు. వెంటనే బాధిత విద్యార్థిని దెందులూరు సీహెచ్‌సీకి ఉపాధ్యాయులు తీసుకువెళ్లారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సుందర్ విద్యార్థిని పరీక్షించి చెవి వెనుక తగిలిన గాయానికి ఒక కుట్టు వేసి వేశారు. బాధిత విద్యార్థి కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రి దెందులూరు పోలీస్ స్టేషన్‌తో ఎస్సై ఆర్ శివాజీకి జరిగిన విషయాన్ని తెలియచేశారు. ఈ విషయాన్ని పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం, జిల్లా విద్యాశాఖ అధికారికి దృష్టికి తీసుకెళ్లారు. దెందులూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థుల మధ్య ఘర్షణ ఘటనపై వెంటనే విచారణ నిర్వహించి నివేదిక అందజేయాలని దెందులూరు మండల విద్యాశాఖ అధికారులను డీఈవో మంగళవారం రాత్రి ఆదేశించారు.

జమిలి ఎన్నికల బిల్లు ప్రజాస్వామ్యానికి విఘాతం

భీమడోలు: జమిలి ఎన్నికల నిర్వహణపై కేంద్ర ప్రభుత్వం చెప్పేవన్నీ కుంటి సాకులని, ఆచరణ సాధ్యం కాదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు అన్నారు. భీమడోలులో మంగళవారం ఆయన ఓ పత్రిక ప్రకటనను విడుదల చేసారు. పార్లమెంట్ ఎన్నికలు ఏకకాలంలో నిర్వహిస్తే తగినంత సిబ్బంది, పోలీసు నిర్వహణ సాధ్యం కాక నెలల తరబడి కొనసాగుతాయని అన్నారు. అలా కాకుండా పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు ఒకేసారి ఎన్నికలు జరగాలంటే ఎంత మంది సిబ్బంది, పోలీసులు కావాలో ఆలోచించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చెప్పే మాటలో పచ్చి అబద్ధాలు, మోసపూరిత ప్రకటనలే కనబడుతున్నాయన్నారు. ఖర్చు తగ్గించే పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం కోసమే జమిలి ఎన్నికలను తెరమీదకు తెచ్చాయన్నారు. దీని వల్ల దేశ ప్రజాస్వామ్యానికి ప్రాంతీయ పార్టీల మనుగడకు చాలా ప్రమాదమని, బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేసారు.

పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలి

ఏలూరు (టూటౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక కోటదిబ్బ సర్వీస్ రిజర్వాయర్ వన్ వద్ద మంగళవారం ఉదయం 43వ జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని దిజోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు, ఏఈ సాయి, ఇన్‌స్పెక్టర్ సీహెచ్ హరినాథ్ బాబు, యూనియన్ కోశాధికారి బి.నారాయణరావు తదితరులు మాట్లాడారు. జాతీయ, యూనియన్ పతాకాలను ఆవిష్కరించారు. మొక్కలు నాటారు.

ఉత్సాహంగా సైక్లోథాన్

ఏలూరు రూరల్ : ఫిట్ ఇండియా ప్రతి ఒక్కరిలో స్ఫూర్తి నింపుతుందని భారత వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బడేటి వెంకట్రామయ్య అన్నారు. మంగళవారం ఏలూరులో స్టేట్ లెవెల్ ఖేలో ఇండియా సెంటర్ (సాయ్) ఆధ్వర్యంలో సైకిల్ రైడింగ్ నిర్వహించారు. స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియం వద్ద జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతిరోజూ సైక్లింగ్ చేయడం వల్ల శారీరక పటుత్వంతో పాటు మానసిక ప్రశాంతత వస్తుందని చెప్పారు. ప్రధాన మంత్రి ప్రారంభించిన ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఆటలు, వ్యాయామంపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతి రోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయాలని సూచించారు. సాయ్ ఇన్‌చార్జి వినాయక్ ప్రసాద్ ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఆరోగ్యం, వ్యాయామం పట్ల అవగాహన కల్పించేందుకు సైకిల్ రైడింగ్ నిర్వహించామని తెలిపారు.

దాళ్వా సాగుకు సమాయత్తం

- నారుమళ్లు, దమ్ము పనుల్లో నిమగ్నమైన రైతులు
- రైతు భరోసా అందక దగా పడ్డామంటున్న వ్యవసాయదారులు



కాగుపాడు ఆయకట్టులో నాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు

ఉంగుటూరు: దాళ్వా పనులకు రైతులు ఉపక్రమిస్తున్నారు. ప్రభుత్వం నుంచి రైతు భరోసా సాయం అందక దగా పడ్డామని రైతులు అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక పంటలు సాగు చేసేందుకు రైతులు పెట్టుబడి కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో సకాలంలోనే పంటల సాగుకు ముందే పెట్టుబడి సాయం అందేదని, దీంతో హుషారుగా వ్యవసాయ పనులు ప్రారంభించేవారమని అన్నదాతలు గుర్తు చేసుకుంటున్నారు.

ఉంగుటూరు మండలంలో 22,500 ఎకరాల్లో వరి సాగు

ఏలూరు జిల్లాలో వరి పండించే అత్యధిక విస్తీర్ణం ఉంగుటూరు మండలం పరిధిలోనే ఉంది. ఈ ఏడాది దాళ్వాలో 22,500 ఎకరాల్లో వరి సాగుకు రైతులు సమాయత్తమయ్యారు. ఈ మేరకు వారు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు ముందస్తుగా 654 ఎకరాల్లో నాట్లు పూర్తి చేశారు. మెట్ట, డెల్టా, కొల్లేరు పరివాహక ప్రాంతం మండలం విస్తరించి ఉంది. కొందరు రైతులు నారుమడులు దమ్ములు చేయడం, కొందరు విత్తనాలు వెదజల్లుతున్నారు. కొందరు రైతులు పొలాలను దమ్ము చేస్తున్నారు. కొందరు తుర్రాలు, గట్ల లంకలు వేస్తున్నారు. ఇలా మండలంలో ఏ ప్రాంతానికి వెళ్లినా రైతులు, కౌలు రైతులు దాళ్వా పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ సంవత్సరం ఎంటీయూ 1121 రకం, పీఆర్ 126 రకాలను రైతులు ఎంచుకుని నాట్లు వేస్తున్నారు. కొన్ని ఏరియాల్లో నారుమళ్లు వేస్తుంటే మరో ప్రాంతంలో నాట్లు వేస్తున్నారు.

రైతు భరోసా అందించాలి



రైతు భరోసా పథకాన్ని గత ప్రభుత్వం మాదిరిగానే కూటమి ప్రభుత్వం కొనసాగించాలి. రైతులకు పెట్టుబడి సాయంగా ఎంతో రైతు భరోసా ఉపయోగపడేది. రైతుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాలి. రైతులు ఆర్థికంగా దెబ్బతినకుండా ఆదుకోవాల్సి బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

– అల్లాడ సుబ్బారావు, రైతు, ఎ.గోకవరం

గతంలో ఆర్థికసాయం అందేది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందించిన రైతు భరోసా ఎంతో ఉపయోగపడేది. వ్యవసాయం పండగలా రైతులు రైతు భరోసా అందుకున్న ఆనందంలో ఉండేవారు. ఈ ఏడాది ప్రభుత్వం రైతు భరోసా సాయం ఊసే ఎత్తడంలేదు. రైతు వర్గాల నిరాశతో ఉన్నారు.

– కొనకళ్ల వెంకటేశ్వరరావు, రైతు, ఉంగుటూరు

మారిన వాతావరణం.. రైతుల బెంబేలు



ధాన్యం రాశిపై టార్పాలిన్ కప్పుతున్న రైతు

గణపవరం/భీమడోలు: : సార్వా కోతలు ఆరంభమైన నాటి నుంచి వరుస తుఫాన్లు, అల్పపీడనాల ప్రభావంతో రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న వాతావరణం మళ్లీ మంగళవారం కూడా రైతులను కలవరపరచింది. అల్పపీడన ప్రభవంతో మంగళవారం మబ్బులతో నిండిపోయిన వాతావరణం సాయంత్రం వర్షం జల్లులు పడుతూ రైతులను బెంబేలెత్తించింది. దీనితో తమ ధాన్యం కాపాడుకోవడానికి రైతులు నానా పాట్లు పడ్డారు. సార్వా కోతలు ఆరంభించిన నాటి నుంచి రైతులను వాతావరణం అడుగడుగునా భయపెడుతూనే ఉంది. వర్షాలకు పలుచోట్ల ధాన్యం రాసులు, బస్తాలు తడిసిపోగా, ఆధాన్యాన్ని రైతులు ఎండబెట్టుకుని అమ్ముకున్నారు. ఇప్పటికే 70శాతం రైతులు సార్వాధాన్యం ఒబ్బిడి చేసుకోవడం, విక్రయించడం ద్వారా ఒడ్డున పడ్డారు. ఇంకా వరి కోయకుండా మిగిలిన రైతులు, కోసి ధాన్యం రాసులు చేసుకున్న రైతులు వాతావరణ మార్పులకు హడలిపోతున్నారు. సోమవారం మబ్బులతో నిండిన వాతావరణం, మంగళవారం సాయంత్రం వర్షం జల్లులు పడటంతో రైతులు నానా హైరానా పడ్డారు. మంగళవారం ఉదయం నుంచి వాతావరణం పూర్తిగా మబ్బులతో నిండి ఉంది. మధ్యాహ్నం దాటిన తర్వాత అక్కడక్కడా వర్షం కురిసింది. దీనితో రైతులు తమ ధాన్యం సంరక్షించుకోవడానికి నానా ఇబ్బందులు పడ్డారు. పుంత గట్లమీద ఎండబెట్టిన ధాన్యాన్ని రాసులుగా చేసి బరకాలు, టార్పాలిన్లు కప్పారు. మరి కొందరు రైతులు ఆఘమేఘాల మీద ధాన్యాన్ని ట్రాక్టర్లపై సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వాతావరణ మార్పులతో వ్యవసాయ అధికారులు, సిబ్బంది క్షేత్ర బాట పట్టారు. ఎలాంటి నష్టం జరుగకుండా రైతులను అప్రమత్తం చేస్తున్నారు. గోనె సంచులను అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయాధికారి యర్రంశెట్టి ప్రసాద్ తెలిపారు. గణపవరం మండలంలో పదివేల ఎకరాలలో మాసూళ్లు పూర్తికాగా, మరో మూడువేల ఎకరాల్లో పంట కోయాల్సి ఉందని ఆయన తెలిపారు. గుండుగొలను, సింగవరంలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యంపై రైతులు టార్పాలిన్లు కప్పి రక్షించే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

పెదపాడు: ప్రజలు గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని ఏలూరు ఆర్డీవో ఎం అచ్యుత అంబరీష్ తెలిపారు. పెదపాడు మండలంలోని కొత్త ముప్పర్రులో మంగళవారం రెవెన్యూ గ్రామ సభను ఆయన ఆర్డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రెవెన్యూ గ్రామ సభల ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించుకునేందుకు గ్రామసభలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. తమ గ్రామ పరిధిలో గ్రామసభలు నిర్వహించేటప్పుడు తమ పొలాలకు సంబంధించిన పనులు అధికారులతో చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సునీత వీఆర్వో ఆర్ఏఎస్ఆర్ చంద్రమూర్తి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కృష్ణా కాలువ డీసీల కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

పెదపాడు: కృష్ణా కాలువ పెదపాడు వట్లూరు డీసీ అధ్యక్ష, ఉపాధ్యక్షలు, ఇతర కార్యవర్గాన్ని మండల ప్రత్యేక అధికారి కే అనూరాధ సమక్షంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పెదపాడు మండలంలోని పెదపాడు, వట్లూరు డీసీలకు నూతన కార్యవర్గాన్ని పెదపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు లావేటి శ్రీనివాసరావు, గుత్తా అనీల్, పెదపాడు తహసీల్దార్ ఏ కృష్ణజ్యోతి, ఎంపీడీవో పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్

పెదపాడు: పర్యావరణానికి హాని కలిగించే హానికర చికెన్ వ్యర్థాలను తీసుకుని వెళ్తున్న వాహనాన్ని మత్స్యశాఖ అధికారులు పట్టుకున్నారు. మత్స్యశాఖ సహాయ తనిఖీ అధికారి సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మత్స్యశాఖ ఏడీ పిషరీష్ ఏడీ రాజ్‌కుమార్ నేతృత్వంలో మంగళవారం గుడిపాడు వైపు నుంచి వడ్డిగూడెంలో రోడ్డులో వెళ్తున్న కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు మత్స్యశాఖ సహాయ తనిఖీ అధికారి మత్స్యశాఖ సహాయకులతో కలిసి వాహనాన్ని అడ్డుకుని పెదపాడు పోలీసులకు అప్పగించారు. దీంతో పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి



గణపవరంలో స్థానిక ప్రతినిధుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న రమణ

గణపవరం: గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రణాళికాబద్ధంగా పనిచేస్తూ గ్రామాలను అభివృద్ధి పథంలో నిలపాలని కోర్సు డైరెక్టర్, ఏపీఎస్ఐఆర్‌డీ (విజయవాడ) జీవీ రమణ అన్నారు. మంగళవారం గణపవరం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు, స్థానిక ప్రతినిధులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు సాగాలన్నారు. ఎల్ఎస్‌డీఎస్ పథకం, ప్రజారోగ్య లక్ష్యాలు, హెల్దీ విలేజ్, చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్, సురక్షిత మంచినీరు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న సభ్యులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

పేదల ఆకలి తీరుస్తున్న ‘దోసెడు బియ్యం’



గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో దోసిళ్లతో బియ్యం తెస్తున్న విద్యార్థులు

గణపవరం: విద్యార్థులు చదువుతోపాటు సేవా భావం, సామాజిక బాధ్యతలను పెంపొందించుకోవాలని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. మంగళవారం కాలేజిలో కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో హ్యాండ్‌ఫుల్ రైస్ కార్యక్రమం నిర్వహించారు. కాలేజిలో చదువుతున్న విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఒక్కో దోసెడు బియ్యాన్ని ఇంటి వద్ద నుంచి తీసుకువచ్చి కాలేజీలో ఏర్పాటు చేసిన డ్రమ్ములో వేశారు. ఇలా పోగుపడిన బియ్యాన్ని గ్రామంలోని వృద్ధ, నిరుపేదలకు అందిస్తామని చెప్పారు. ప్రతి నెలా ఒకరోజున ఈకార్యక్రమం నిర్వహిస్తూ వచ్చిన బియ్యాన్ని పేదలకు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మధురాజు, అధ్యాపకులు టి.అక్కిరాజు, స్వరూపరాణి, వెంకటరమణ, వెంకట్రావు, శారదాదేవి పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రిన్సిపల్ లావణ్య

దెందులూరు: హేలాపురి ఇంజనీరింగ్ కాలేజీ ఆధ్వర్యంలో చదువుతోపాటు క్రీడల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని హేలాపురి సైన్స్ అండ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం లావణ్య అన్నారు. దెందులూరు మండలం గోపన్నపాలెం పంచాయతీ పరిధిలోని వేగవరంలో ఉన్న హేలాపురి ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణలో కాలేజీ ప్రిన్సిపల్ ఎం లావణ్య కళాశాల, ఏవో కరుణానిధి అధ్యక్షతన యూనివర్సిటీ స్థాయి బాలుర క్రికెట్ పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ వరకు కాకినాడ జేఎన్టీయూ పరిధిలోని యూనివర్సిటీ స్థాయిలో బాలుర విభాగంలో క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామని కాలేజీ ఆవరణలో యూనివర్సిటీ స్థాయి బాలుర క్రికెట్ పోటీల్లో 65 టీంలు పాల్గొన్నాయని తెలిపారు. క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపిన అనంతరం క్రికెట్ పోటీలను ప్రిన్సిపాల్ లావణ్య ప్రారంభించారు. కళాశాల మేనేజ్‌మెంట్ క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారికి అన్ని సహాయ సహకారాలు అందిస్తుందని ప్రిన్సిపల్ తెలిపారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

భీమడోలు: పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని జిల్లా ట్రెజరీ అధికారి టి.కృష్ణ అన్నారు. భీమడోలు విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పెన్షనర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పంచకర్ల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ట్రెజరీ అధికారి టి.కృష్ణ మాట్లాడుతూ పెన్షనర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తాను చిత్తశుద్ధితో పని చేస్తానన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పని చేసిన విశ్రాంత ఉద్యోగులకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. తొలుత రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు తమ సమస్యలను ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకుని వెళ్లారు. అనంతరం డీటీవో టి.కృష్ణ, ఎస్‌టీవో ఎన్.శ్రీనివాసరావు, సలహాదారుడు బి.వెంకటేశ్వరరావును దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాలేటి బ్రహ్మారావు, గుల్ల నూకరాజు, గంధం వెంట్రావు, వైఆర్‌కే శర్మ, గుల్ల నూకరాజు, అప్పారావు, మండే సుధాకర్, కార్యాలయ సిబ్బంది రాజు, ఫణికుమార్, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాలు రైతుల అభివృద్ధికి కృషి చేయాలి

దెందులూరు: సాగునీటి సంఘాలు రైతుల అభివృద్ధికి కృషి చేయాలని పలువురు నాయకులు, అధికారులు అన్నారు. దెందులూరు మండల పరిధిలో రైతులకు ప్రజలకు అత్యంత కీలకమైన సాగునీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు ప్రశాంతంగా ముగిసి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని అధికారులు తెలిపారు. మంగళవారం దెందులూరు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఇరిగేషన్ అధికారుల ఆధ్వర్యంలో మల్కాపురం, గోదావరి కాలువ, కృష్ణా కాలువకు, గోదావరి కాలువ వినియోగదారుల సంఘానికి అధ్యక్ష, ఉపాధ్యక్షులను, ఇతర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొవ్వలి రాళ్ల తూము నీటి సంఘానికి అధ్యక్షుడ్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.టీడీపీ నేత దెందులూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు వీరమాచినేని ప్రభాకర్, టీడీపీ దెందులూరు మండల అధ్యక్షుడు నాయకులు మాగంటి నారాయణ ప్రసాద్, నూతన కార్యవర్గాలకు శుభాకాంక్షలు తెలిపారు.

భీమడోలు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా గంధం లక్ష్మణ్

భీమడోలు: డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్, పూళ్ల నీటి సంఘం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడి ఎన్నిక మంగళవారం ప్రశాంతంగా జరిగింది. ఈ ఎన్నికకు ఆర్‌బీ ఈఈ వైవీ కిషోర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. మండల పరిధిలో భీమడోలు, గుండుగొలను, పూళ్ల, కైకరం, అంబర్‌పేట సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు హాజరయ్యారు. డిస్ట్రిబ్యూటరీ కమిటి చైర్మన్‌గా గంధం లక్ష్మణ్, ఉపాధ్యక్షునిగా గుండుగొలను నీటి సంఘం అధ్యక్షుడు దోకల నాగేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారికి అధికారి వైవీ కిషోర్ బాబు ధ్రువీకరణ పత్రాలను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.రమాదేవి, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, మైనర్ ఇరిగేషన్ ఏఈ కె.లాజర్‌బాబు పాల్గొన్నారు.

ప్రపంచ చెస్ చాంపియన్ గుకేష్ యువతకు స్ఫూర్తి

దెందులూరు: ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ విజేత దొమ్మరాజు గుకేష్ నేటి యువతకు స్ఫూర్తిగా నిలిచారని దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిసెట్టి నూకరాజు అన్నారు. మంగళవారం నర్సింగ్ కళాశాలలో ప్రపంచ చాంపియన్‌షిప్ విజేత గుకేష్ చిత్రపటాలను, జాతీయ జెండాలను ప్రదర్శించి నర్సింగ్ విద్యార్థులు హర్షం వ్యక్తం చేసి స్వీట్లు పెంచారు. 18 ఏళ్లకే గుకేష్ భారత గ్రాండ్ మాస్టర్ హోదాను సాధించడం అభినందనీయమన్నారు. విశ్వనాథన్ ఆనంద్ తర్వాత మరో భారతీయుడు ప్రపంచ చాంపియన్‌షిప్ సాధించడం సంతోషంగా ఉందన్నారు.

రెండు గ్రామాల్లో జూదరుల అరెస్ట్

దెందులూరు: మండలంలో రెండు గ్రామాల్లో జూదరులను అరెస్టు చేశామని దెందులూరు ఎస్సై ఆర్.శివాజీ తెలిపారు. మంగళవారం గోపన్నపాలెంలో ఐదుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 5,060 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వేగవరంలో నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 5,100 స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మండలంలో ఏ గ్రామంలోనైనా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలని, అటువంటి వారి సమాచారం గోప్యంగా ఉంచుతామన్నారు.

ఇంధన పొదుపుతో మంచి భవిష్యత్

- జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇందనాన్ని పొదుపు చేయడం ద్వారా భావితరాలకు మంచి భవిష్యత్ ఇవ్వవచ్చని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఫైర్ స్టేషన్ సెంటర్ మీదుగా ఆర్‌ఆర్‌పేటలోని విద్యుత్ భవన్ వరకు నిర్వహించిన ర్యాలీని ఆమె ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య, చింతమనేని ప్రభాకర్‌లతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఇందన పొదుపుపై అవగాహన కలిగించే పోస్టర్లు, కరపత్రాలను ఎమ్మెల్యేలు, జేసీ విడుదల చేశారు. ఈ సందర్భంగా ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ఇంధన వనరుల పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిదని అన్నారు. ప్రజల్లో ఇంధన పొదుపుపై అవగాహన కలిగించేందుకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 20 వరకు పొదపు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ఇంధన పొదుపుపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ డబ్బును పొదుపు చేసుకునే విధంగానే విద్యుత్‌ను కూడా అవసరాల మేరకు వాడుకోవాలని సూచించారు. ఈపీడీసీఎల్ ఏలూరు ఎస్‌ఈ పి.సాల్మన్ రాజు మాట్లాడుతూ విద్యుత్ వినియోగంపై గ్రామాల్లో జానపద కళాకారులు, జనవిజ్ఞాన వేదిక కార్యకర్తలతో విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, చిత్రలేఖనం, స్వయం సహాయ సంఘాల మహిళా బృందాలతో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ డీఈ కేఎం అంబేద్కర్, డీఈఈ పి.రాజకుమారి, ఏఈ పి.ప్రసన్నవల్లి, డీఈఈ బీవీ కృష్ణరాజ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎస్ఎస్ కృపావరం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



చాంపియన్‌షిప్ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ సత్తానియేలు

దెందులూరు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని దెందులూరు మండలం గోపన్నపాలెంలోని సీతారామ ప్రభుత్వ వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ సత్తానియేలు అన్నారు. వ్యాయామ కళాశాల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చూపి పలు పతకాలు సాధించి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాజమండ్రిలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో శని, ఆదివారాల్లో నిర్వహించిన అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో అథ్లెటిక్స్ పరుగు పందెం పోటీల్లో సీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల క్రీడాకారులు ప్రతిభ కనబరిచి అథ్లెటిక్స్ పరుగు పందెంలో యూనివర్సిటీ స్థాయి బాలికల విభాగంలో ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించడం ఎంతో గర్వకారణమని ప్రిన్సిపాల్ అన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

క్రీడా పోటీల్లో సత్తా చాటిన విద్యార్థికి సత్కారం



భీమడోలులో క్రీడాకారుడిని సత్కరిస్తున్న ప్రిన్సిపల్ బి.రవికుమార్, సిబ్బంది

భీమడోలు: భీమడోలు శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థి పి.సాయిరామ్ హాఫ్ మారథాన్ క్రీడా పోటీల్లో సత్తా చాటి తృతీయ స్థానాన్ని సాధించారు. రాజమండ్రిలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈనెల 13, 14వ తేదీల్లో 21 కిలోమీటర్ల హాఫ్‌మారథాన్ పోటీలు నిర్వహించారు. కళాశాలలో బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న పి.సాయిరామ్ ఈ పోటీల్లో పాల్గొని సత్తాచాటాడు. గతంలో అఖిల భారత యూనివర్సిటీ స్థాయిలో మంగళూరులో నిర్వహించిన పోటీల్లోనూ పి.సాయిరామ్ సత్తా చాటాడు. భీమడోలు శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో క్రీడాకారుడిని ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్, అధ్యాపకులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీడీ సురేష్‌కుమార్, ఎన్‌సీసీ కెప్టెన్ కె.శివశంకర్, ఏ.శ్రీనివాస్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని అభినందించారు.

పంచాయతీల ఆదాయం వృద్ధికి కృషి చేయాలి



భీమడోలులో ప్రజాప్రతినిధులు, సిబ్బంది శిక్షణ ఇస్తున్న ఎంపీహెచ్‌ఈవో కిషోర్

భీమడోలు: గ్రామ పంచాయతీలు ఆదాయం వృద్ధికి కృషి చేసి సుస్థిరాభివృద్ధికి పాటు పడాలని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి కోరారు. భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయిలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజుల పాటు నిర్వహించే సర్పంచులు, గ్రామకార్యదర్శులకు రెండవ బ్యాచ్ తొలి రోజు శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి కోర్సు అసిస్టెంట్ డైరెక్టర్, ఈవోఆర్‌డీ ఏ.సుందరి అధ్యక్షత వహించారు. భీమడోలు పీఆర్ ఏఈ సూర్యచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం, ఎంపీహెచ్‌ఈవో కిషోర్,లు సుస్థిరాభివృద్ధికి సూచించిన అంశాలపై శిక్షణ అందించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ఆదాయ మార్గాలను పెంపొందించుకోవాలన్నారు. భీమడోలు, పూళ్ల, దుద్దేపూడి, పోలసానిపల్లి, కోడూరుపాడు సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
దెందులూరు, ఉంగుటూరు
90102 23729
79955 66352
Office mail : tpgadvt@gmail.com